06ATP31_06ATP31.qxd 31-08-2025 PM 11:40 Page 1



## రైతులకు అండగా ఆలోచన చేసే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు

- అభివృద్ధికి ఎవరు సలహాలు ఇచ్చినా స్వీకరిస్తాం
మీడియా సమావేశంలో టిడిపి యువ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**కళ్యాణదుర్గం ఆగస్టు 31 ప్రభాతవార్త :**

కళ్యాణదుర్గం రైతు కష్టాలను తెలుసుకొని అండగా నిలబడేందుకు అన్ని చర్యలు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీసుకుంటున్నారని, అలాంటి ఎమ్మెల్యేపై వైసీపీ నాయకులు అనవసరపు నిందలు వేయడం మానుకోవాలని కళ్యాణదుర్గం టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ప్రజావేదికలో మండల పార్టీ అధ్యక్షులు ధనుంజయ, శివన్న, టీఆర్ తిప్పేస్వామి, సింగిల్ విండో అధ్యక్షులు మల్లిపల్లి నారాయణ, బొజ్జన్న, కుమార్, లాల్ కృష్ణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ ధనునాయక్, మాజీ జడ్పీటీసీ గురుప్రసాద్, మాజీ సర్పంచులు రామాంజనేయులు, రాఘవేంద్ర బాబు, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కొండాపురం అనిల్ చౌదరి, మీడియా సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేని వైసీపీ నాయకులు ఎమ్మెల్యే మీద ఆరోపణలు చేస్తూ అభివృద్ధికి ఆటంకంగా మారుతు న్నారని అన్నారు. వెనుకబడిన కళ్యాణదుర్గం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే ఈ ప్రాంతాన్ని ఎంచుకుని, ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. సొంత నిధులు కూడా ఖర్చుపెట్టి అభివృద్ధికి తపన పడుతున్నారని అన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుండి నియోజకవర్గానికి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో ఆలస్యం అవుతోందని, సొంత నిధులు వెచ్చించి కాలువ పనులు ప్రారంభించారన్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు 114 చెరువులకు రెండున్నర సంవత్సరాలలో సాగునీరు తెచ్చి కరువు ప్రాంతమైన కళ్యాణదుర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని ఇచ్చిన హామీని మరిచిపోకుండా గుర్తుపెట్టుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వం నిధులు సమకూర్చకపోయినా పనులు ప్రారంభించిన గొప్పతనాన్ని అభినందించాలని, విమర్శించడం సరికాదన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎన్నో పాఠశాలలకు డెస్కులు, పాఠశాల భవనాల నిర్మాణాలకు సొంత నిధులు కేటాయించిన ఎమ్మెల్యే ఇప్పటికే నియోజకవర్గంలో 27 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు నాలుగు కోట్లతో బీటీ రోడ్లు వేయించారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కళ్యాణదుర్గం అభివృద్ధి కోసం ఆచరణీయమైన సలహాలు ఇస్తే స్వాగతిస్తామని అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు

## బివిఎం స్పోర్ట్స్ ప్రీమియర్ లీగ్ లో విజేతగా కరణం చికప్ప పాఠశాల



విజేతగా ట్రోపిని అందుకుంటున్న కరణం చికప్ప పాఠశాల జట్టు

**కళ్యాణదుర్గం టౌన్, ఆగస్టు 31 , ప్రభాతవార్త**

బీవీఎం స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన కరణం చికప్ప పాఠశాల విజేతగా నిలిచింది. ఈ మేరకు ఆదివారం పాఠశాల సిబ్బంది మీడియాకు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ అండర్ 16 క్రికెట్ టోర్నమెంట్లో 16 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్లో జ్ఞాన భారతి పాఠశాలపై కరణం చికప్ప పాఠశాల ఘన విజయం సాధించింది. విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ 20 వేల నగదు బహుమతి ఇవ్వగా, రన్నర్ గా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. బివిఎం స్పోర్ట్స్ ప్రోపరేటర్ రవి బ్రహ్మ మాట్లాడుతూ రానున్న రోజుల్లో క్రికెట్ టోర్నమెంట్ తో పాటు ,వాలీబాల్ , బ్యాట్మింటన్ తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు. టోర్నమెంటుకు గ్రౌండ్ ను కేటాయించిన జ్ఞాన భారతి పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ట్రోఫీలకు స్పాన్సర్ చేసిన యూనియన్ బ్యాంక్ ఉద్యోగి లోకేష్, టీచర్ బద్దె నాయక్ , సూర్య టైల్స్ ప్రిపరేటర్ సురేష్ కు టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అప్పుల ఒత్తిడి తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

**కళ్యాణదుర్గం, ఆగస్టు 31 ప్రభాతవార్త**



ఆత్మహత్య చేసుకున్న శ్రీకాంత్

పట్టణంలో రెవెన్యూ కాలనీలో నివాసం ఉంటున్న మఠం శ్రీకాంత్ (52) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్టిడి బూత్ నిర్వహకుడిగా సుపరిచితుడైన శ్రీకాంత్ చీటీలు నడుపుతూ, ఆర్థిక లావాదేవీలలో నష్టపోయి అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇటీవలే తల్లి, తండ్రి వృద్ధాప్యరీత్యా కాలం చేశారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉంటున్న శ్రీకాంత్ ఊహించని విధంగా తన ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం కుటుంబంలో విషాదాన్ని నింపుతోంది. భార్య, కొడుకు, కుమార్తె కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు. కళ్యాణదుర్గం పట్టణంలో కూడా చాలామందికి స్థిరపరిచితుడు కావడంతో తనకొచ్చిన కష్టాన్ని ఎవరితోనూ చెప్పకుండా ఉరి వేసుకోవడం స్థానికుల్లో కూడా నీకు ఏ కష్టం వచ్చింది రా .. అంటూ స్నేహితులు సోషల్ మీడియాలో ఆవేదన చెందుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాంత్ మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వీరశైవ రాష్ట్ర కార్పొరేషన్ మహిళ అధ్యక్షురాలు దంపతులను సన్మానం

**కనేకల్లు ఆగస్టు 31 ప్రభాతవార్త**



రాష్ట్ర వీరశైవ కార్పొరేషన్ అధ్యక్షురాలు స్వప్నకి సన్మానిస్తున్న దృశ్యం.

వీర శైవ ఆంధ్రప్రదేశ్ మహిళా కార్పొరేషన్ అధ్యక్షు రాలుగా నూతనంగా ఎన్నికైన స్వప్నకి కనేకల్ మండలం వీరశైవ సంఘం ఆధ్వర్యం లో ఆదివారం జిల్లా కేంద్రం వారి స్వగృహం నందు నూతన అధ్యక్షురాలు స్వప్న దంపతులకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్క రించారు. వీరశైవ కార్పొ రేషన్ ద్వారా ఎన్నికన్నా స్వప్నకి పలువురు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో వీర శైవ లు చాలా వెనకబడి ఉన్నారని వీరికి ప్రత్యేకంగా అభివృద్ధి చెందేలా కృషి చేయా లని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి వీరశైవ లింగాయతి కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కణేకల్ అఖిల భారత వీరశైవ సంఘం అధ్యక్షుడు దండిన చిదానంద, నేషనల్ కమిటీ మెంబర్ మరియప్ప, శరవన్న గౌడ,మహేష్ గౌడ, మృత్యుం జయ స్వామి, పెండేకల్ నాగరాజు, మంజునాథ,బజాజ్ షోరూం తిప్పేస్వామి, పలువురు వీరశైవ సంఘం నాయకులు అందరూ పాల్గొన్నారు

## రోగులు ఎక్కువ.. సిబ్బంది తక్కువ

.. సీజనల్ రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రి ..



సిబ్బంది కొరతతో సతమతమవుతున్న డాక్టర్లు

**కనేకల్లు ఆగస్టు 31 ప్రభాతవార్త**

కనేకల్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి నందు గత 10 రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు రోజు వందల కొద్ది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి క్యూ కట్టారు. ఆస్పత్రి చిన్నది కావడంతో రోగులు బయట వరకు కిలో నిలబడాలన్న పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత వలన డాక్టర్లు నానా తంటాలు పడుతున్నారు. గత ఏడాదిలో ప్రభుత్వాసుపత్రికి రావాలంటేనే ప్రజలు భయపడేవారు డాక్టర్ ఎవరు అందుబాటులో ఉండేవారు కాదు. ఈ ఏడాది డాక్టర్స్ అందుబాటులో ఉన్నందువల్ల ప్రభుత్వాసుపత్రికి ప్రతిరోజు రోగుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న వలన, వర్షాకాలంతో ప్రజలు చిన్నపిల్లలు ప్రతి ఒక్కరికి తలనొప్పి జ్వరము జలుబు కాళ్ళు నొప్పులతో ప్రతిరోజు వందల్లో రోగులు హాస్పిటల్ కి వస్తున్నారు, చిన్న పెద్ద తేడా లేకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో వందలకొద్దీ రోగులు తరచూ వస్తున్నారు,ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ప్రభుత్వాసుపత్రి నందు రోగులు తగ్గట్టుగా స్టాఫ్ లేదు, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండడం వలన ప్రభుత్వ ఆసుపత్రి పై రోగులకు ప్రజలకు నమ్మకం ఏర్పడింది... ఇదే విషయం డాక్టర్ షరీఫ్ నీ అడుగగా . సీజనల్ రోగాల వలన గత పది రోజుల నుండి రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు, ఆసుపత్రి నందు రోగుల తగ్గట్టుగా స్టాఫ్ లేనందున చాలా ఇబ్బందికరంగా అవుతున్నదని,ఒక డాక్టర్ తక్కువగా ఉన్నారు,ఒక హెడ్ నర్స లేరు,ఇద్దరు స్టాఫ్ నర్సులు కూడా లేరు,ముఖ్యంగా చిన్నపిల్లల డాక్టర్ అసలే లేరు, మొత్తంగా 50 శాతం సిబ్బంది తోనే వైద్యం ప్రజలకు అందిస్తూ ఆసుపత్రిని నడుపుతున్నామని అన్నారు, ఇదిగాక భవనం కూడా చాలా చిన్నది కావడంతో రోగులకు కూర్చోవడానికి నిలబడడానికి వీలులేని పరిస్థితిగా తయారైందని అలాగే ఉన్న సిబ్బందితోనే అందరూ కలిసి వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ షరీఫ్ తెలిపారు, ఇకనైనా జిల్లా అధికారులు ఇది గమనించి కనేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి పూర్తిస్థాయి డాక్టర్లను సిబ్బందిని నియమించి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలో సంపూర్ణ వైద్యం అందేదారులు చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఎంతైనా ఉంది

## చిక్కనేశ్వర స్వామి వినాయక నిమర్జనం

- వందలాదిగా తరలివచ్చిన ప్రజలు



బేసిక్నేశ్వర వినాయక నిమజ్జనం

**కనేకల్లు ఆగస్టు 31 ప్రభాతవార్త**

కనేకల్ మండల కేంద్రంలోని శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవాలయం నందు శ్రీ చికనేశ్వర వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన శ్రీ వినాయక స్వామికి ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఐదవ రోజైన ఆదివారం సాయంకాలం శ్రీ వినాయక స్వామి విగ్రహాన్ని ట్రాక్టర్ పై ఉంచి ప్రత్యేకంగా అలంకరించి మేళా తాళాలతో డీజే సౌండ్లతో పట్టణ ప్రధాన వీధుల గుండా గ్రామీణ బ్యాంకు మీదుగా దిగువ గేర్ వరకు వెళ్లి రామనగరం మీదగా తుంగభద్రా హెచ్ఎల్సీ కాలువ నందు నిమజ్జనం నిర్వహించారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ పోలీసులు ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు హెచ్ఎల్సీ కాలువ దిగే చుట్టూ కట్టెలను అడ్డం కట్టి గట్టి బందోబస్తు మధ్య నిమర్జనం నిర్వహించారు.

## వినాయకుడి లడ్డు వేలం పాట దక్కించుకున్న టీం లెజెండ్స్



శ్రీ గణేష లడ్డు వేలంలో దక్కించుకున్న స్నేహితుల బృందం

**కళ్యాణదుర్గం, ఆగస్టు 31 ప్రభాతవార్త**

పట్టణంలోని టీమ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో టీ సర్కిల్ నందు జరిగిన వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా స్వామి వారి లడ్డు ప్రసాదం వేలం పాటలో 201,000/ రూపాయలకు టీం లెజెండ్స్ దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు మాజీ సర్పంచ్ కొండాపురం అనిల్ చౌదరి,మహేంద్ర,వెంకటేశులు, పృథ్వీ రాజ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ఓంశాంతి నిర్వాహకురాలు బ్రహ్మకుమారిస్ పుష్పలత



రక్తదాన శిబిరం ప్రారంభోత్సవ దృశ్యం

**అమరాపురం ఆగస్టు 31 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అమరాపురం బ్రహ్మకుమారిస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్ లో ఆదివారం విశ్వబ్ బంధుత్వ దినోత్సవ శుభ సందర్భంగా మెగా రక్తదాన శిబిరమును ఓంశాంతి నిర్వాహకురాలు బ్రహ్మకుమారీస్ పుష్పలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. అనంతపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ డాక్టర్లచే నిర్వహించబడింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మోజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ మండల కన్వీనర్ శివ రుద్రప్ప,ఏఎస్ఐ రామాంజనేయులు, టిడిపి నాయకులు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు బ్రహ్మకుమారిస్ పుష్పలత మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా సాటి మనిషి ప్రాణాపాయంలో ఉన్నప్పుడు ఎంతో ఉపయోగపడుతుందని ఇలాంటి కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రాజయోగిని ప్రకాశమణి దాది వారి 18వ పుణ్యస్మృతి దినోత్సవం సందర్భముగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఈ కార్యక్రమం ప్రారంభించడం ఎంతో శుభదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది దాకా యువకులు విచ్చేసి రక్తదానాన్ని చేశారని ఆమెవారిని ప్రశంసించారు. ప్రమాదాలు శస్త్ర చికిత్సలకు చికిత్స సమయంలో రక్తం చాలా అవసరమని దాతలు అందించిన రక్తదానం ద్వారా మరో ప్రాణానికి జీవం పోస్తుందన్నారు. సాటి మనిషికి సేవ చేయాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమెతో పాటు విచ్చేసిన ముఖ్య నాయకులుపిలుపునిచ్చారు. ఉదయం నుండి సాయంత్రం వరకు రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

**గుంతకల్లు, ఆగస్టు 31 ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంచార జాతుల అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మహిళా సంఘం కార్యాలయంలో సంచార జాతుల విముక్తి దినోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 1871లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం దాదాపు 250 జాతులను నేరస్తు జాతులుగా ప్రకటించి వారి జీవన ప్రమాణాలను దెబ్బతీశారని గుర్తు చేశారు. 1952లో భారత ప్రభుత్వం వారిని నేరస్తుల జాతుల నుండి తొలగించారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విముక్తి దినోత్సవ సభను నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు సంచార జాతులను రాజ్యాంగ బద్ధ జాతులుగా గుర్తించి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి మండలి ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలసంత సంఘం రాష్ట్ర అధ్యక్షులు రుద్రాక్ష కొల్లాయప్ప, మహిళా సంఘం అధ్యక్షురాలు ఇందిరాదేవి, వంశరాజ్ సంఘం నాయకులు ఉల్లిగప్ప, సుబ్బయ్య, కృష్ణ, మాదాసి కురువ సంఘం నాయకులు కడియాల శివ, బండి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు

- కమీషనర్పై మండిపడ్డ కార్మిక సంఘాల నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

**గుంతకల్లు, ఆగస్టు 31 ప్రభాతవార్త**

కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని కార్మిక సంఘాల నాయకులు వీరభద్రస్వామి, నరసయ్య, జగదీష్, లింగమూర్తిలు మున్సిపల్ కమీషనర్ నయీమ్అహమ్మద్పై మండిపడ్డారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో ట్రేడ్ యూనియన్లు ఏఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ పారిశుధ్య, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. 5మంది ఔట్సోర్సింగ్, 8 మంది శాశ్వత ఉద్యోగులు రిటైర్మెంట్ తీసుకోవడం జరిగిందన్నారు. అయితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాల్సిన అధికారులు పూర్తి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రధానంగా కమీషనర్ వారి పట్ల వ్యవహరిస్తున్న ధోరణి మంచిది కాదన్నారు. గుత్తి, తాడిపత్రి, హిందూపురం, ధర్మవరం మున్సిపాలిటీల్లో కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. అయితే గుంతకల్లులో మాత్రం కమీషనర్ లేనిపోని సాకులు వెతుకుతూ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆయన పద్ధతి మార్చుకోకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా కమీషనర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో రంగనాయకులు, చిన్న కొండయ్య, వాసు వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయంలో చోరీ

**గుత్తి, ఆగస్టు 31 ప్రభాతవార్త**



చోరీ జరిగిన దృశ్యం

మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో వున్న శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియనివ్యక్తులు ఆలయంలో హుండీలలో వున్న దాదాపు 30 వేల రూపాయల నగదును అపహరించారు. హుండీలను శివారు ప్రాంతంలో పారవేసి పరారయ్యారు. ఈ మేరకు అర్చకులు నరసింహచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 31 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని ఏ ఇస్లామియా సుహరా వర్దియా ఆధ్వర్యంలో ఆదివారం మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. సెప్టెంబర్ 5న మిలాద్ ఉన్ నబీ మహమ్మద్ ప్రవక్త 1500 జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నోత్తరాలు, రాతపూర్వకంగా, దాదాపు 300 మంది విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విర్వాహకులు అన్వర్పాషా మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విభాగాల్లో మూడు బహుమతులు మరియు 10 కన్సోలేషన్ బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ హుస్సేన్, షేక్ చాంద్బాషా, హసన్ హజరత్, రఫిక్, ఇషాక్, మహమ్మద్గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీనీవా కాలువలో పడి వృద్ధురాలు మృతి

**కనగానపల్లి ఆగస్టు 31 ప్రభాతవార్త**



కాలువలో పడి మృతి చెందిన చాకలి సాలమ్మ

ఆదివారం బాలేపాల్యం హంద్రీనీవా కాలువలో వృద్ధురాలు చాకలి సాలమ్మ 79 సంవత్సరాలు శవమై తేలింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తాడు సహాయంతో శవాన్ని వెలికి తీశారు. పోలీసుల సమాచారం మేరకు మృతురాలు చాకలి సాలమ్మ కూడేరు మండలం కరుట్లపల్లి గ్రామానికి చెందినది. ఈమె గ్రామంలోని హంద్రీనీవా కాలువ పక్కన ఉన్న సుంకులమ్మ దేవాలయానికి శనివారం సాయంత్రం మొక్కుకునే క్రమంలో కాలుజారి కాలువలో పడిపోయింది. ఆదివారం ఉదయం పది గంటల సమయంలో బాలే పాల్యం గ్రామం హంద్రీనీవా కాలువలో శవం కొట్టుకు రావడం జరిగింది. మృతురాలు భర్త చాకలి గౌరప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇటీవల కాలువ సిమెంట్ లైనింగ్ పనులు చేయడంతో ఎవరైనా కాలు జారితే బయటికి వచ్చే పరిస్థితి లేదని అక్కడికి వచ్చిన జనం చర్చించుకోవడం జరిగింది.

## మా భూమిని ఆక్రమించి దౌర్జన్యంగా పంటలు సాగు చేస్తున్నారు..!

-జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంటనే స్పందించి న్యాయం చేయాలి
-విలేఖరుల సమావేశంలో బాధిత వైఎస్సార్సీపీ నాయకుడు కొడికి గోవిందు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధిత కుటుంబానికి చెందిన కొడిగి గోవిందు, వైఎస్సార్సీపీ నాయకులు

**ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామంలోగల మా 21.05 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన అధికార తెలుగుదేశం పార్టీకు చెందిన కొందరు ఆక్రమించి దౌర్జన్యంగా పంటలు సాగు చేస్తున్నారని జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంటనే స్పందించి న్యాయం చేయాలని బాధిత కుటుంబానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు, కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొడికి గోవిందు కోరారు. పట్టణంలోని స్థానిక ఆర్అండ్బీ అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వైఎస్సార్సీపీ మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, పార్టీ ఉరవకొండ మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్ తదితరులతో కలిసి మాట్లాడారు. కొడికి గోవిందు మాట్లాడుతూ వేల్పుమడుగు గ్రామంలో సర్వే నంబర్ 141లో కాశీభట్ల గుండురావు శర్మకు 42.21 ఎకరాల భూమి ఉండగా ఇందులో 10.55 1/2 ఎకరాలను కోనంకి వెంకటరామన్న, 10.55. 1/2 ఎకరాలను పొప్పూరు బాలకొండన్న కాశీభట్ల గుండురావు శర్మ నుండి కొనగోలు చేశారన్నారు. కాశీభట్ల గుండురావు శర్మ మరణానంతరం అతని కుమారులు సాయిప్రసాద్, వెంకటశర్మ, భానుప్రకాష్రావు నుండి నా అల్లుడు పి.జయకుమార్ 30-06-2023లో 21.05 ఎకరాలను కొనగోలు చేసి సాగు చేసుకొంటున్నాడన్నారు. అయితే పి.జయకుమార్ కొన్న మా భూమిని వేల్పుమడుగు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు జూలై 31 నుండి అక్రమించి దౌర్జన్యంగా సాగుచేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార బలాన్ని అడ్డుపెట్టుకొని దౌర్జన్యం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ కమ్మటి రామాంజినేయులు, సుంకన్న, మర్రిస్వామి, డిష్ సురేష్, రమేష్, డిష్ వెంకటేష్, రామాంజినేయులు పాల్గొన్నారు.

## వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

-కేరింతలు కొట్టిన పిల్లలు, పెద్దలు



వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



ఇంద్రావతి గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం సందడి

**ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త**

వినాయక నిమజ్జనోత్సవం ఆదివారం 5వ రోజు ఉరవకొండ మండలంలో వైభవంగా కొనసాగింది. గతనెల 27వ తేదీన వినాయక చవితి పర్వదినం సందర్భంగా పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో వివిధ ప్రదేశాల్లో కొలువుదీర్చిన వినాయక విగ్రహాలను నిమజ్జనం గావించారు. వినాయక విగ్రహాల ఉదయం నుండి రాత్రి వరకు మేళతాళాలు, డప్పు వాయిద్యాలు మధ్య రంగులు చల్లుకుంటూ 'జైబోలో గణేష్ మహరాజ్కి జై' అంటూ నినాదాలు చేస్తూ ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, ఈచర్లు, ఆటోలుపై ప్రత్యేకంగా అలంకరించి వినాయక ప్రతిమలను పెట్టి నృత్యాలు చేస్తూ ఊరేగింపులు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. లత్తవరం, చిన్నముష్టూరువద్ద హంద్రీనీవా కాలువ, మోపిడి, నింబగల్లు తదితర ప్రాంతాల్లో హెచ్ఎల్సీ కాలువలు, పీఏబీఆర్, ఎంపీఆర్ కాలువల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కాగా విగ్రహాల ఊరేగింపుకు ముందు ఉత్సవ సమితులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్గ్రేడ్ స్టేషన్ సీఐ బి.మహానంది సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎన్నికల్లో గొడవ..!

- రెండు ప్యానళ్ల మధ్య ఆధిపత్య పోరుతో ఎన్నిక వాయిదా



వాగ్వాదం చేసుకొంటున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు





ఎన్నికను వాయిదా వేస్తున్న ఎన్నికల అధికారి
బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

**ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎన్నికల్లో రెండు వర్గాలకు చెందిన ఉపాధ్యాయుల మధ్య ఆదివారం గొడవ జరిగింది. పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసు బందోబస్తు మధ్య ఏపీటీఎఫ్ వజ్రకరూరు మండల కమిటీ ఎన్నిక సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి హాజరుకాగా ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు సాకే భాస్కర్ వ్యవహరించారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటి తరువాత కోరం లేదని ఎన్నికల అధికారి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో గొడవ చెలరేగింది. గతానికి భిన్నంగా ఇప్పుడు కోరం లేదని ఎన్నికను వాయిదా వేయడం ఏమిటని సభ్యత్వం ఉన్న ఉపాధ్యాయులు మరికొందరు వస్తున్నారని సమయమిచ్చి ఎన్నికలు జరిపి తీరాలని ఒక వర్గం పట్టుబట్టింది. దీంతో ఎన్నికను వాయిదా వేయాలనే వర్గం, ఎన్నిక జరుపాలనే వర్గం మధ్య కొద్దిసేపు తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. గతంలో ఎన్నడూ కోరం చూసి ఎన్నికలు జరుపలేదని ఏకగ్రీవంగా కొందరి పేర్లను రాసి వారికే మండల బాధ్యతలు అప్పగించేవారని ఇప్పుడు పోటీ ఉండటంతో కోరం ఉంటేనే ఎన్నికలు జరుపుతామని చెబుతున్నారని ఒకవర్గం ఆరోపించింది. మరోవర్గం మాత్రం కోరం ఉన్నపుడే పారదర్శకంగా ఎన్నికలు జరుపాలని పట్టుబట్టింది. ఎన్నికల సందర్భంగా కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులు తమ బలం, బలగం చూపించుకోవడానికి తమ తమ కులాలకు చెందిన వారిని కూడా రప్పించుకోవడంతో గొడవ పెద్దది కాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## బళ్లారిలో మెగా డెయిరీకి శంకుస్థాపన

- రాఘవేంద్ర హిట్నాల్



మెగా డెయిరీ నిర్మాణానికి సంబంధించి నిర్వహించిన సమావేశంలో రాఘవేంద్ర హిట్నాల్, డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా పాల్గొన్నారు

బళ్లారి, ఆగస్టు 31(ప్రభాత వార్త)

సెప్టెంబర్‌లో మెగా డెయిరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. రాయచూర్, బళ్లారి, కొప్పల్ మరియు విజయనగరం జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షుడు, ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ తెలిపారు. మెగా డెయిరీ స్థాపనకు సంబంధించి డీసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాలూకాలోని కోలగల్లు సమీపంలో మెగా డెయిరీ నిర్మాణానికి 15 ఎకరాలు అవసరం. ప్రభుత్వం కొనుగోలుకు ఆమోదం తెలిపిన తర్వాత సమావేశం నిర్వహించామని ఆయన అన్నారు. మెగా డెయిరీ నిర్మాణం కోసం కేఎంఈఆర్‌సీలో ఇప్పటికే 80 కోట్లు కేటాయించామని ఆయన అన్నారు. భూమి కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని ఆయన అన్నారు పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి, పాల ఉత్పత్తిని పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలను కూడా సమావేశంలో చర్చించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో బళ్లారి జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, రబకోవి మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభు శంకర్, జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హారిస్, సుమైర్ రబకోవి ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ముండరగి నాగరాజుచే విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాగరాజ్

బళ్లారి, ఆగస్టు 31 (ప్రభాతవార్త)

లిడ్కర్ అధ్యక్షుడు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముండ రగి నాగరాజ్ 60వ పుట్టినరోజు సందర్భంగా, ఆయన అభిమానులు బాపూజీనగర్ వెంకటేష్ నగరంలోని బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో ఉచితంగా నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, 60వ పుట్టినరోజు జరుపుకుంటున్న ముందరగి నాగరాజ్‌కు దేవుడు దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం ప్రసాదించాలని, రాజకీయాల్లో ఉన్నత స్థానాన్ని పొందాలని బాపూజీనగర్ వెంకటేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అబూబకర్ సిద్ధిఖ్, అస్లాం భాషా, సునీల్, ఇ.జి. రెడ్డి ముండరగి నాగరాజ్‌ను హృదయపూర్వకంగా సత్కరించారు. సత్కారాన్ని స్వీకరించిన తర్వాత ముండరగి నాగరాజ్ మాట్లాడుతూ, పుట్టినరోజు పేరుతో కేకులు, క్రాకర్లకు విచ్చలవిడిగా ఖర్చు చేసే బదులు, పుస్తకాలు పంపిణీ చేయడం, బట్టలు పంపిణీ చేయడం, ఆహార కిట్లు అందించడం వంటి వాటి ద్వారా నలుగురికి ప్రయోజనం చేకూర్చే విధంగా వేడుక నిర్వహిస్తే అర్థవంతంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా, దళిత సంఘర్ష్ సమితి నాయకులు గోవర్ధన్, జాలిబెంచి నాగరాజ్, అరుణ్‌కుమార్, అక్కి రవి, చేతన్ బాబీలతో సహా వందలాది మంది ముండరగి నాగరాజ్ అభిమానులు హాజరయ్యారు.

## ఘనంగా గణనాథుడి నిమజ్జనం



గణనాథుడి నిమజ్జనంలో పాల్గొన్న యువకులు

నల్లచెరువు ఆగస్టు 31, ప్రభాతవార్త

నల్లచెరువు మండల కేంద్రంలోని గ్రామ ప్రజలు యువకులు మహిళలు పెద్ద ఎత్తున నిమజ్జనానికి కార్యక్రమాన్ని వాల్మీకి సంఘం సభ్యులు సినిమాను గుట్ట కాలనీవాసులు. వినాయక చవతి పండుగ పురస్కరించుకుని పురవీధుల గుండా కొలువుదీరిన వినాయక విగ్రహాల కు 5. రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమర్జనానికి ఆదివారం తరలించారు. వినాయక స్వామి విగ్రహాలను ట్రాక్టర్ల వ్యాన్లు ఆటోల పైన ప్రత్యేకంగా అలంకరించి డీజే డ్రమ్స్ లు సౌండ్లతో రంగోలి కలర్స్. కోలాటాలతో యువత ఉత్సాహాలతో మహిళలు కేరింతలతో జై బోలో గణేష్ మహరాజ్ కి అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు కొనసాగించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మక్బుల్ బాషా సిబ్బందిని తో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బొమ్మిరెడ్డిపల్లిలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ



ప్రజలకు క్యూ ఆర్ కోడ్ ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నల్లచెరువు ఆగస్టు 31 ప్రభాతవార్త

మండలం సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు లక్ష్యంగా కూటమి నాయకులు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వైయస్సార్సీపీ మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు మాజీ సర్పంచ్ తిరుపాల్ రెడ్డి అధ్యక్షతన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంను గ్రామంలో ఆదివారం నిర్వహించారు.. ఈ సందర్భంగా రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల పథకాలలో భాగంగా మహిళలకు 1500 ప్రతి నెల ఇస్తామని ఎన్నికల సమయంలో మభ్యపెట్టిన కూటం నాయకులు ఇప్పుడు పి ఫోర్ అని కొత్త నాటకానికి తెర లేపి రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారు అన్నారు. అనంతరం గ్రామంలో అనంతరం గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి బాబు చేస్తున్న మోసాలను క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి శ్రీనాథ్ రెడ్డి. మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద రెడ్డి మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి కొనపల్లి రమణారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, ఎస్టీ సెల్ హైటెక్ రమణ, సూర్య శేఖర్ రెడ్డి జెసిబి మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి,వైసీపీలో రాజకీయ వేడిని రగులుస్తున్న గొంచికాడు, ఆగర్బ శ్రీమంతుడు సంభోదనలు

- పరస్పరం అవరోపణలు వాదనలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 31 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఇటీవల రాజకీయ ఆరోపణలు ప్రత్యేకరోపణలకు రెండు సంబోధనలు రాజకీయ రచ్చకు కారణం అవుతున్నాయి. ఇటీవల వైసిపి కళ్యాణ్ దుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య కుందుర్పి మండల పర్యటనకు వెళ్లిన సందర్భంగా ఆగిపోయిన కుందుర్పి బ్రాంచ్ కెనాల్ కాలువ పనులను పరిశీలించి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు కాలువల నిర్మాణాలను పట్టించుకోవడంలేదని విమర్శించే సమయంలో ఎమ్మెల్యే సురేంద్రబాబును ఆగర్భ శ్రీమంతుడు, గొంచికారు అనే సంబోధన రాజకీయ రచ్చకు దారి తీసింది. ఈ సందర్భంగా ప్రజా వేదికలో సీనియర్ టిడిపి నాయకులు తలారి రంగయ్య తమ ఎమ్మెల్యే సురేంద్రబాబులు ఆగర్భ శ్రీమంతుడుగొంచికారు అంటూ వ్యంగ్యాస్త్రాలు అందించడం సమంజసం కాదని, తమ ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. గ్రామంలో ఎవరైనా భూస్వామి పెద్దమనిషి ఉంటే వారిని గ్రామాలలో గొంచికారు అని పిలవడం ఆనవాయితీ అని, కంబదూరులో తాను కూడా ఒక గొంచికారేనని మాజీ సర్పంచ్ శ్రీరాములు పేర్కొనడం గమనార్హం. ఈ సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్లు మరో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గొంచికారు అనే పదం అసభ్యకర మైనదేదీ కాదని, గ్రామాలలో భూస్వామి, ధనవంతులను అలా సంబోధించడం సర్వసాధారణమని, ఆ విషయం టిడిపి నాయకులే ప్రకటించారని, ఆ మాట తమ నేత తలారి రంగయ్య సంబోధించడంలో ఏం తప్పు ఉందని ఎదురు ప్రశ్న వేశారు. ఆదివారం ప్రజా వేదికలో టిడిపి నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మరోసారి ఈ సంబోధనలపై విమర్శిస్తూ తమ నాయకుడు ఎమ్మెల్యే ఆగర్భ శ్రీమంతుడు కాదని, ఎంతో కృషిచేసి తన కష్టంతో శ్రీమంతుడు అయ్యారని, గొంచికారు అని సంబోధించడం వ్యంగంగానే స్ఫురిస్తోందని అలా సంబోధించడం తలారి రంగయ్యకు తగదని మరల ఆరోపించడం స్థానికంగా రాజకీయ చర్చనీయాంశం అయ్యింది. ఈ చర్చ ఇంతటితో ముగిస్తుందా..? మరల కొనసాగుతుందా చూడాలి మరి.

పంట సాగు విధానం, దిగుబడులను పరిశీలించిన

## జి కే వీ కే అగ్రికల్చర్ స్టూడెంట్స్



రైతులతో సమావేశమైన కర్ణాటక విద్యార్థులు

గోరంట్ల ఆగస్టు 31 ప్రభాతవార్త

గోరంట్ల మండలంలో నార్సింపల్లి పంచాయతీ ఎర్రబల్లి గ్రామము లోని రైతు పద్మనాభ రెడ్డి చెందిన దానిమ్మ తోట తొలి కాపు దిగుబడిని కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు జీకేవికే అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు రైతు సాగుచేసిన దానిమ్మ పంటను పరిశీలించి, పంట సాగు విధానం, అధిక దిగుబడి కి తీసుకున్న సస్యరక్షణ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు పద్మనాభరెడ్డి సాగుచేసిన దానిమ్మ పంట తోపాటు టమోటా పంట సైతం దిగుబడిలో మంచి ఫలితాలు సాధించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు పద్మనాభ రెడ్డి, నార్సింపల్లి రఘు రామిరెడ్డి, జీకేవికే అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## టిడిపి నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ



ఆరోగ్య సమాచారాన్ని అడుగుతున్న దృశ్యం

అమరాపురం ఆగస్టు 31 ప్రభాతవార్త

మండల పరిధిలోని హేమావతి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రామచంద్రప్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిపై అతడి కుమారుడు గిరీష్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కాచెల్లెళ్ల దేవాలయాల్లో చిత్రలింగేశ్వర సోమేశ్వర దేవాలయాలను సందర్శించారు. అదేవిధంగా హురకేరె లోని వినాయకుని మంటపంలో మాజీ ఎమ్మెల్సీ మరియు స్థానిక టిడిపి నాయకులు విశేష పూజలు పాల్గొని తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన సమస్యలపై స్థానిక నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కుమార్ స్వామి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయ కుమార్, టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు గొల్లమారనపల్లి మండల క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి, టిడిపి కన్వీనర్ తిప్పజ్జ, గిరీష్, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ చెరువు సంఘం అధ్యక్షుడు శ్వేత్ నారాయణ, మాజీ ఎంపిటిసి శివకుమార్, శ్రీనివాస్, ఎంపీటీసీ ఓంకార్ స్వామి, గోపియాదవ్ ,నరసింహమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ గౌడరంగప్ప, సప్లయర్ సిద్ధప్ప, మహాలింగప్ప, సికందర్, హురకేరి తిమ్మన్న తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ఫార్మర్‌లోని రాగి వైరు దొంగతనం

కనేకల్లు ఆగస్టు 31 ప్రభాతవార్త

కనేకల్ మండల పరిధిలోని గంగలాపురం గ్రామం పొలంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్ఫార్మర్ ని పగలగొట్టి లోపల ఉండే రాగి వైరును దొంగలించారు. దీని వలన రైతులకు మోటర్లాడక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాన్స్ఫార్మర్ లోని రాఘవయ్యలను దొంగలించుతున్న దొంగలు గతంలో కూడా చాలాసార్లు దొంగలించారు . దొంగలను అధికారులు పట్టుకొని ప్రజలకు అన్నం పెట్టే రైతుకు అండగా నిలబడాలని మరోసారి మండలంలో ట్రాన్స్ఫారం లోని రాగి వైరు దొంగతనాలు కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని మండల రైతులకు కోరుతున్నారు. ట్రాన్స్ఫార్మర్ ఎస్టిమేషన్ వేసి పై అధికారులకు నివేదిక అందిచ్చామని రెండు రోజుల్లో ట్రాన్స్ఫార్మర్ రైతులకు అందిస్తామని ఏఈ తెలిపారు.



ట్రాన్స్ఫార్మర్ లో దొంగలు రాగి వైరు దొంగలించిన దృశ్యం

## వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న వాల్మీకి సంఘం అధ్యక్షులు



వినాయక నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకి సంఘం అధ్యక్షులు

డి.హిరెహాళ్ ఆగస్టు 31 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఆదివారం రాయదుర్గం పట్టణంలోని చర్చి ఏరియాలో ఐసిడిఎస్ కార్యాలయం సమీపంలో ఏర్పాటుచేసిన వినాయక స్వామికి పూజలు నిర్వహించి నిమజ్జనం కార్యక్రమం కు గణపతిని తరలించారు. కోలాహాలంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ఆయన సతీమణి సరస్వతి, ఇతర కుటుంబ సభ్యులు, ఆ సేవా సమితి సభ్యులు, మిత్రులతో కలిసి నిమజ్జన వేడుకలను ప్రారంభించి వినాయకుడిని నిమజ్జనం కు తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో కలసి మెలసి జరుపోవడం సంతోషదాయకమైన విషయమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. వినాయకుడిని విభిన్న రూపాల్లో నైపుణ్యం కలిగిన వినాయక విగ్రహాల తయారీదారులు పలు రకాల ఆకృతుల్లో అందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. వినాయక చవితి పర్వదినంను జరుపుకోవడం ఏకత్వంలో భిన్నత్వంకు ప్రతీకగా నిలుస్తుందని గణపతి భక్తులచేత విశేష పూజలు లందుకుని,ప్రజల కోర్కెలు తీర్చడానికి భూమిపైకి వస్తాడని ఆయన తెలిపారు. వినాయకస్వాముల వారిని తిరిగి స్వర్గానికి పంపించడానికి గణపతి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తారని ఈ నిమజ్జన వేడుకలలో ప్రజలందరూ సంతోషంగా మేళ తాళాలతో గణనాథుడిని వేడుకాగా నిమజ్జనం చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతల మధ్య బందోబస్తు నిర్వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గం పోలీసు శాఖకు అభినందనలు తెలుపుతూ ప్రజలు ప్రతి ఒక్కరు ఈ సందర్భంగా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. రాయదుర్గం పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీలో గజానన భక్తి మండలి సభ్యుల ఆహ్వానం మేరకు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తెలుగుదేశం పార్టీ సీనియర్ మహిళా విభాగం నాయకురాలు సంపత్ కుమారి తదితరులతో కలిసి స్వామివారికి పూజల అనంతరం భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సేవా సమితి సభ్యులు యువత హరీష్ కుమార్, నరేంద్ర, మీడియా సలహాదారులు బోయపాటి ప్రకాష్, లాలప్ప, మిత్రులు రాము, విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న వైకాపా రాష్ట్ర నాయకులు

అమరాపురం ఆగస్టు 31 ప్రభాతవార్త



ఉత్సవాల్లో పాల్గొన్న వైకాపా రాష్ట్ర కార్యదర్శి దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం లోని పోలీస్ స్టేషన్ సమీపంలో గరుడ గణేశ యూత్ ఐకాన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గరుడ గణేశ నిమజ్జన కార్యక్రమంలో ఆదివారం రాత్రి వైకాపా రాష్ట్ర కార్యదర్శి లీగల్ సెల్ ప్రెసిడెంట్ వైసి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ భక్తిశ్రద్ధ లతో ప్రశాంత వాతావరణంలో గణనాథుని పూజించడం ద్వారా అన్ని వర్గాల వారికి సమాజానికి మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ రామిరెడ్డి, మడకశిర పట్టణ ఉపాధ్యక్షుడు గోపి, నాగభూషణ్ రెడ్డి, నరేష్ రెడ్డి నాగభూషణ్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ధను, నగేష్ తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా మిత్రబృందం విచ్చేసిన ప్రముఖులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

## రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు మండల కళాకారుడు

శెట్టూరు ఆగస్టు 31. ప్రభాతవార్త



శెట్టూరు మండలం లక్ష్మంపల్లి గ్రామవాసి పాటిల్ నల్లపరెడ్డి సెప్టెంబర్ 5 నుండి జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ కళామందిరంలో వేదికగా రాష్ట్రస్థాయి నాటక పోటీలు జరుగుతాయి ఈ పోటీలకు గాను అనంతపురం జిల్లా నుంచి ఇద్దరు ఎంపిక కావడం జరిగింది అందులో ఒకరు మా మండల వాసి కావడం విశేషం నల్లపురెడ్డి బాలనాగమ్మ నాటకంలో తన ప్రతిమను ప్రదర్శించడం అన్నారు ఇప్పటికే ఆయన గ్రామస్థాయిలో మండల స్థాయిలో జిల్లా స్థాయిలో అనేక ప్రదర్శన ద్వారా ప్రజల ప్రశంసలు అందుకున్నారు ఇప్పుడు రాష్ట్ర స్థాయి ఎంపిక కావడం జరిగింది. గ్రామస్తులు నల్లపురెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు తమ పేరు నిలబెట్టాలని ఈ సందర్భంగా తెలియజేశారు

## కాణిపాక వరసిద్ధి వినాయకుడి లడ్డూ ప్రసాదం రూ.70వేలు

- బహిరంగ వేలంలో దక్కించుకున్న గోల్డ్‌షాప్ బబ్లూ



కాణిపాక వరసిద్ధి వినాయకుడి లడ్డూ ప్రసాదం, ఇతరత్రా పూజా వస్తువులను వేలంలో దక్కించుకున్న వారు

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని 10వ వార్డు పాఠశాలవద్ద ఏర్పాటైన కాణిపాక వరసిద్ధి వినాయకుని లడ్డు ప్రసాదాన్ని గోల్డ్ షాప్ బబ్లూ 70,000 రూపాయలకు దక్కించుకున్నారు. ఆదివారం ఉదయం స్వామివారి లడ్డూ, ఇతరత్రా పూజా సామాగ్రిని ఉత్సవ కమిటీ బహిరంగ వేలం నిర్వహించింది. ఈ వేలంలో వెండి గొలుసు, ఉంగరాన్ని గట్టు ధనుంజయ 18,516 రూపాయలకు, వెండి కడియంను కొమ్మసాని మల్లికార్జున 15,016 రూపాయలకు, శాలువాను బసన్నగారి నవీన్ 11,116 రూపాయలకు, కండువాను బత్తల కిరణ్, చంద్ర 4,000 రూపాయలకు దక్కించుకున్నారు. అనంతరం వారిని ఉత్సవ కమిటీ శాలువాలుకప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించింది. అనంతరం మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ కాణిపాక వరసిద్ధి వినాయకుడి విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

## ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

-ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

-ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి



విలేఖరులతో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి తదితరులు

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంవద్ద ఆయన ఫెడరేషన్ స్థానిక నాయకులతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. గౌని పాతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిపడ్డ నాలుగు డీఏలను వెంటనే విడుదల చేసి పీఆర్సీ కమీషన్‌ను నియమించాలని, పీఆర్సీ కమీషన్ ఆలస్యమైతే 30శాతం ఐఆర్ (మధ్యంతర భృతి) ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులకు యాప్‌ల పనిభారం తగ్గించి, అసెస్‌మెంటు పుస్తకాలు రద్దు చేయాలన్నారు. గత జూన్ నెలలో జరిగిన బదిలీల్లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి, కొత్తగా ఎన్నికయిన డీఎస్సీ ఉపాధ్యాయులను సంబంధిత పాఠశాలలకు కేటాయించి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. గత సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకున్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు బండారు నారాయణస్వామి, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.ధనుంజయ, ఉరవకొండ మండల ప్రధాన కార్యదర్శి బి.సి.ఓబన్న, విడపనకల్లు మండల అధ్యక్షుడు బి.నజీర్, జిల్లా కౌన్సిలర్ ఎం.శ్రీనివాసులు, సభ్యులు సాకే మునిస్వామి, వెంకటేశులు, బి.చంద్రశేఖర్, లింగమూర్తి, రఘురాములు, రామాంజినేయులు, దేవేంద్ర, పొండేటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండలో ఒక మోస్తారు వర్షం

లోతట్టు కాలనీల్లో నీరు చేరి ప్రజల అవస్థలు



ఉరవకొండలో ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తున్నప్పటి దృశ్యం

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త

ఉరవకొండ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఒక మోస్తారు వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల ప్రాంతం నుండి దాదాపు గంట పాటు వర్షం కురవడంతో వినాయక నిమజ్జనానికి విగ్రహాల తరలింపులో కొంత ఆటంకం ఏర్పడింది. వర్షం కారణంగా షరా మామూలే అన్న చందంగా క్లాక్ టవర్ కూడలి, సులభ కాంప్లెక్స్ ప్రాంతంతో పాటు లోతట్టు కాలనీలు, కొలిమి, రాయంపల్లి లేఅవుట్లలో జగనన్న కాలనీల్లో నీరు వెళ్లే మార్గం లేక వర్షపు నీరు రోడ్లపై చేరి మట్టి రోడ్లు మరింత ఛిద్రమయ్యాయి.

## తీవ్రమైన జ్వరంతో యువకుడి మృతి..!

- పొలం పనులు చేస్తూ కుప్పకూలిపోయిన వైనం

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త



తీవ్రమైన జ్వరంతో మృతి చెందిన యువకుడు వరుణ్

తీవ్రమైన జ్వరంతో బొమ్మనహాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వరుణ్ (20) అనే యువకుడు మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన వరుణ్ తండ్రితో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు. అయితే వరుణ్ గత మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే ఆదివారం ఉదయం తండ్రితోపాటు పొలం పనులు చేస్తుండగా ముక్కులోంచి రక్తం కారగా కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందాడని నిర్ధారించాడు. ఎంతో ఉత్సాహంగా ఉండే చేతి కొచ్చిన కొడుకు జ్వరంతో బాధపడుతూ మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కాచికుంటలో తిప్పేరుద్ర స్వామికి విశేష పూజలు

అమరాపురం ఆగస్టు 31 ప్రభాతవార్త



విశేష పూజల దృశ్యం

మండల పరిధిలోని కాచికుంట గ్రామం నందు శ్రీ తిప్పేరుద్ర స్వామి దేవాలయం నందు మూల విగ్రహానికి అభిషేకం అర్చనలతో పాటు విశేష పూజ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహానికి రంగురంగుల పూలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు దాసోహ కార్యక్రమాన్ని మాజీ డీలర్ హనుమంతరాయప్ప కుటుంబ సభ్యులు లక్ష్మక్క తదితరులతోపాటు గంగన్న బుడ్డ హనుమజ్జ కుటుంబ సభ్యులచే నిర్వహించారు.

## మంజునాథ్ సన్మానించిన తెదేపా నాయకులు

రొద్దం. ఆగస్టు 31 ప్రభాతవార్త

మండల పరిధిలోని బూచెర్ల గ్రామానికి చెందిన రెడ్డి వారి మంజునాథను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర స్వచ్ఛ మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా పెనుగొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెదేపా నాయకులు ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ ఈసీ హరీష్ మాజీ సర్పంచ్ గోపాల్ హనుమంతరాయుడు రుద్ర ప్రసాద్ సురేష్ బిజెపి నాయకులు వేణుగోపాల్ తిప్పే స్వామి నెట్టెం రామాంజనేయులు ఎంహెచ్ రామాంజనేయులు నాగరాజు రాజు మురళి రొద్దం పాత్రికేయులు నాగరాజు సోమశేఖర్ నారాయణ యాదవ్ తదితరులు ఘనంగా సన్మానించడం జరిగింది రాబోవు రోజుల్లో మరింత ఉన్నత పదవులు పొందాలని మంజునాథుని గుర్తించి కార్పొరేషన్ డైరెక్షన్ చేసినందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు తెలుగుదేశం పార్టీకి తెదేపా నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు

## రేపు వైయస్సార్ వర్ధంతి వేడుకలకు తరలిరండి

అమరాపురం ఆగస్టు 31 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురంలోని వైయస్సార్ విగ్రహం వద్ద ఈనెల2వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమరాపురం సర్పంచ్ వాగేష్ తెలిపారు. కావున మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైకాపా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వైకాపా అనుబంధ సంఘాలు, నూతన వైకాపా గ్రామపంచాయతీ కన్వీనర్లు సభ్యులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

